# ఘనంగా సద్దుల బతుకమ్మ

హనుమకొండ జిల్లా వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, స్థానిక ఆలయాలు, చెరువుల వద్ద ఆడి పాడారు. హనుమకొండ హంటర్‌రోడ్డులో హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఆయన నివాసంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. నగరంలో మేయర్ గుండు సుధారాణితో పాటు వారి కుటుంబసభ్యులు బతుకమ్మ ఆడిపాడారు. అలాగే, కాజీపేట 100 ఫీట్ల రోడ్డుపై వడ్డేపల్లి చెరువు కట్ట వద్ద గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. కాజీపేట ట్రాఫిక్ సీఐ సుజాత, స్థానిక సీఐ సార్ల రాజు నేతృత్వంలో ఎస్సై లలిత బందోబస్తును నిర్వహించారు. అలాగే, ఎల్కతుర్తి, ధర్మసాగర్, కమలాపూర్, వేలేరు మండలాల్లో మహిళలు బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్


భీమదేవరపల్లి : ములుకనూరులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


వేలేరు : పీచర గ్రామంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


హనుమకొండ : హంటర్‌రోడ్డులోని ఇంటిలో బతుకమ్మతో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ దంపతులు


ధర్మసాగర్ : రిజర్వాయర్ వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు


కమలాపూర్ : ఉప్పల్‌లో బతుకమ్మ ఎత్తుకున్న రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్


కాజీపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

# విజయీభవ!

- నేడు విజయదశమి
- రామ్‌లీలా నిర్వహణకు ఏర్పాట్లు
- ముస్తాబైన ఆలయాలు

నమస్తే నెట్‌వర్క్, అక్టోబర్ 22 : లోక కల్యాణం కోసం అపరకాళికైన దుర్గామాత మహిషాసురుడిని వధించింది. శిష్ట రక్షణ కోసం దుష్ట శిక్షణ తప్పదనీ, ఏనాటికైనా చెడుపై మంచే గెలుస్తుందని నిరూపించింది. తొమ్మిది రోజుల పాటు భీకర పోరు చేసి, పదో రోజు ఆశ్వీయుజ శుద్ధ దశమి రోజున మహిషుడిని సంహరించింది. చెడుపై 'మంచి' సాధించిన విజయంగా ఆ రోజున విజయదశమిని జరుపుకుంటున్నాం. కాగా, నేడు సోమవారం ఈ వేడుకలను ఘనంగా జరుపుకొనేందుకు ఉమ్మడి జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. దేవాలయాలన్నీ సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. హనుమకొండలోని సిద్ధేశ్వరాలయం, వరంగల్‌లోని ఉర్సు రంగలీల మైదానం, చిన్న వడ్డేపల్లి, భూపాలపల్లిలోని అంబేద్కర్ స్టేడియం, ములుగులో సాధన స్కూల్ పక్కనున్న స్థలంలో, మహబూబాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియం, జనగామలోని బతుకమ్మ కుంట మైదానంలో రామ్‌లీలాకు ఏర్పాట్లు పూర్తిచేశారు.

పూర్వం మహిషాసురుడు అనే రాక్షసుడు, బ్రహ్మ ఇచ్చిన వరాన్ని ఆసరా చేసుకొని, ముల్లోకాలను పీడించసాగాడు. అతడి బాధల నుంచి విముక్తి కల్పించాలని దేవతలంతా త్రిమూర్తులకు మొరపెట్టుకున్నారు. త్రిమూర్తులు, మహిషాసురుడిని ఎదుర్కోవడం తమ వల్ల కాక, దుర్గామాతను వేడుకున్నారు. ఆమె తొమ్మిది రోజుల పాటు భీకర పోరాటం చేసి పదో రోజున మహిషాసురిడిని వధిస్తుంది. నాటి నుంచి విజయదశమి జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.

**పాండవుల కథ..**

మరో కథ ప్రకారం.. అరణ్య, అజ్ఞాత వాసాన్ని పూర్తి చేసుకున్న పాండవులు హస్తినాపురానికి చేరుకున్న రోజు ఆశ్వయుజ శుద్ధ దశమి పాండవులు తిరిగి రాజ్యానికి చేరుకోగానే ప్రజలు దశమిని ఘనంగా జరుపుకుంటారు. దీంతో ఇది విజయదశమిగా మారిందని చెబుతారు. విజయదశమి వేడుకల్లో ఆయుధాలను, శమీవృక్షాన్ని పూజించేది కూడా ఈ కథను అనుసరించే! అడవిలో సహజంగా పెరిగే శమీ వృక్షం కొమ్మలను తీసుకొచ్చి గ్రామ చావడి, కాలనీల్లో, ఆలయాల ఆవరణల్లో ప్రతిష్ఠించి పూజిస్తారు. తర్వాత అందరూ అక్షింతలతో కలిపి, ఆ ఆకులను తీసుకుని బంధువులకు, పెద్దలకు ఇచ్చి దీవెనలు తీసుకుంటారు.

**తెలంగాణ సంప్రదాయం..**

తెలంగాణలో బతుకమ్మ, దసరా పండుగలను ఘనంగా జరుపుకుంటారు. ఆడబిడ్డలు, అల్లుళ్లు, కొడుకులు, కోడళ్లు, మనుమలు, మనుమరాళ్లు, తాతలు, నానమ్మలు, అమ్మమ్మలు అందరూ పిండి వంటలు, కొత్త బట్టలు, ఆటలు, పాటలతో ఇల్లంతా సందడిగా మారుతుంది. ఆప్యాయతానురాగాలు, బావామరదళ్ల సరదాలు, కూడళ్ల వద్ద కోలాటాలు, నృత్యాలు, దేవుడి ఊరేగింపులతో గ్రామాలు కళకళలాడుతాయి. గ్రామాల్లో పాలపిట్టను దర్శించుకుంటారు. దసరా రోజున పాలపిట్టను చూస్తే ఏడాది పొడవునా శుభం కలుగుతుందని విశ్వసిస్తారు.

**ఆయుధ పూజ ప్రత్యేకం**

దసరా రోజు యంత్రం, వాహన, పనిముట్లకు పూజలు చేసి పూలతో అలంకరిస్తారు. దీని కోసం ఆలయాల్లో వాహనాలు బారులు తీరుతాయి.

ఆలయ అర్చకులు వాహనాలకు పూజలు చేసి తృణమో ఫణమో పుచ్చుకుంటారు.


పార్టీలో చేరిన వారికి గులాబీ కండువా కప్పుతున్న కౌశిక్‌రెడ్డి

## అభివృద్ధికి ఆకర్షితులై చేరికలు

**ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి**

**బీఆర్ఎస్‌లో చేరిన గౌడ కులస్తులు**

కమలాపూర్, అక్టోబర్ 22 : బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై చాలా మంది పార్టీలో చేరుతున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన సుమారు 100 మంది గౌడ కులస్తులు బీఆర్ఎస్ పార్టీలో పార్టీలో హుజూరాబాద్‌లో వారికి కౌశిక్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. మూడోసారి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ సత్యనారాయణరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 25న బొడ్రాయి ప్రతిష్ఠాపన

కరీమాబాద్, అక్టోబర్ 22 : ఫోర్టురోడ్డులో ఈ నెల 25 నుంచి 3 రోజుల పాటు బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నట్లు విద్యానగర్ కాలనీ అధ్యక్షుడు అచ్చ వినోద్‌కుమార్ తెలిపారు. ఆదివారం 39వ డివిజన్ విద్యానగర్‌కాలనీలో కాలనీవాసుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చ వినోద్‌కుమార్ మాట్లాడుతూ బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవం పురస్కరించుకుని నిర్వహించే పూజల్లో కాలనీవాసులు పాల్గొనాలన్నారు. కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పిట్ట సురేందర్, ఆకుల కుమారస్వామి, గై రమేశ్, ఎనుకంటి రాజు, ఇనుముల కుమారస్వామి, సుధాకర్, సాంబయ్య పాల్గొన్నారు.


కాజీపేట చౌరస్తాలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## కాజీపేటలో బీఆర్ఎస్ కార్యకర్తల ప్రచారం

కాజీపేట, అక్టోబర్ 22 : వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ గెలుపు కోసం కాజీపేట చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని దుకాణాల్లో తిరుగుతూ ఇటీవల సీఎం కేసీఆర్ విడుదల చేసిన ఎన్నికల మ్యానిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా 63వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బెదరికోట రంజిత్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా ప్రజాసేవలో ఉంటూ, ఆపదలో ఆదుకుంటున్న దాస్యం వినయ్‌భాస్కర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎం రాకేశ్, నాగబెల్లి శ్రీధర్, బరిగెల వినయ్, సునీల్, వెంకట్, కల్యాణ్, శేఖర్ పాల్గొన్నారు.


చీరెలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ రవీందర్

## పారిశుధ్య కార్మికులకు చీరెల పంపిణీ

కాజీపేట, అక్టోబర్ 22 : కాజీపేట 62వ డివిజన్ సోమిడిలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు దసరా కానుకగా ఆదివారం స్థానిక కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్-రమా దంపతులు చీరెలను పంపిణీ చేశారు. పండుగ సందర్భంగా డివిజన్‌లో విధులు నిర్వర్తించే పారిశుధ్య కార్మికులకు తన సొంత ఖర్చులతో వీటిని పంపిణీ చేసినట్లు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో మంతుర్తి బొంద్యాల్, స్థానికులు, కార్మికులు పాల్గొన్నారు.